## కూటికోసం కోటివేషాలు, అదే మోసాలు—4

# రఘురామోదంతం

తురగా కృష్ణమోహన్‌రావు

తెలుగుదేశంలో నాటకమాడితే, టిక్కెట్టు కొనుక్కొని వచ్చి చూడ్డానికి ప్రేక్షకులు ఎందుకు సిగ్గుపడతారో ఇప్పుడు నాకుతెలుసు. కలెక్టరుగారి చుట్టాలొచ్చి ముందు సీట్లలో కూచుంటారు—పిల్లా మేకాతో వచ్చి. సూపర్నెంటుగారి దగ్గర పనిచేసే గుమాస్తాగారి అబ్బాయి ఫ్రెండ్సు రెండోవరసంతా కూచుంటారు. మున్సిపల్ కమీషనర్‌గారి స్నేహితులు కొన్నిసీట్లు ఆక్రమించుకుంటారు. రైల్లోలాగే నాటకం హాల్లో! టిక్కెట్టు కొనుక్కొని వచ్చేవాడికి చోటుండదు. అది సరే. చోటుంటుందని గేరంటీ ఇస్తాం. నాటకం చూడ్డానికి టికెట్టు కొనుక్కొని ఎవరైనా వస్తారా? రారు. కారణం?

కారణం మీకు తెలుసా? తెలిస్తే, చెప్పండి: వింటాను. తెలియకపోతే — మాటాడ కూరుకోండి. నేను చెప్తాను. రైట్?

అసలు నాటకం అంటే ఏమిటి? కొందరు మనుష్యులు మేకప్ వేసుకొచ్చి, 'మేము మేమేకాని, మేము కాదు: నమ్మండి, నమ్మకపోండి' అంటారు మనల్ని. మేకప్వేసుకువచ్చి, ఇంటికప్పెగిరి పోయేటట్టు అరుస్తారు. ఆ అరిచే మాటలైనా వాళ్లవా అంటే కావు: ఎవడో రాసిచ్చినవి. అరుస్తూ వచ్చి మనలో కలిసిపోతారా అంటే పోరు. ఒక తెర ఏర్పాటు చేసుకొని, ఆ తెర వెనక ఆడతారు. మనకేదో భ్రాంతి కల్పిస్తామంటారు: మోసపొమ్మంటారు. ఒక రూపాయి ఏభైనయాపైసలు టికెట్టుకొనుక్కొని వెళ్లి, మోసపోవలసిన ఖర్మ మనకేం పట్టింది కనక? చివరకు మోసపోయినా, నాటకాలవాళ్లే మోసపోయేది!

మోసపోదల్చుకుంటే, రాజాలా మోసపోడానికి అవకాశాలు ఉన్నాయి జీవితంలో. రాజాలాంటి మనుష్యులున్నారు మనల్ని మోసపుచ్చడానికి. వాళ్ల చేతుల్లో మోసపోయాం అన్నా, పరువూ ప్రతిష్ఠా ఉంటుంది దేశంలో. నలుగురితో చెప్పుకోడానికి అవకాశం ఉంటుంది. రంగు సరిగ్గా పులుముకోడం చేతకాని నాటకాలవాళ్ల వేషాలకి మోసపోడమా? మా రఘు అన్నట్టు: సిగ్గు సిగ్గు!

ఓహో! రఘును మీరు కలవలేదు కాబోలు, ఇంతవరకు. కలిసే ఉంటారు: మీకు తెలిమండదు. మాట్ మై ఫ్రెండు, రఘు! అతడీ క్షణంలో రఘురామారావో, రఘురామయ్యో, రఘురామనో, రఘురామరెడ్డో తెలియదు. అది మీరు సాతకేశ్వరరావో, సాతకేశ్వరయ్యో, సాతకేశ్వరనో, సాతకేశ్వరరెడ్డో అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది. అతన్ని నేను రఘు అంటాను: రఘురావ్ అనికూడా అనను. అతనిపేరు రఘువీర్ ఐపోవచ్చు. మధ్యన నాకెందుకు పాపం? అందుకని రఘు అంటాను క్లుప్తంగా. రఘు చేతుల్లో మోసపోడానికి మీరు రూపాయి ఏభై నయాపైసలు టికెట్టు చెల్లించనక్కర్లేదు. అంతకంటె పెద్ద టికెట్టే చెల్లిస్తారు — మీకు తెలియకుండానే. తెలిసేసరికి మోసం ఐపోతుంది. మీకు బాగానే ఉంటుంది — నలుగురితో చెప్పుకోడానికి.

రఘు కొంచెం తేడాగా ఆ శ్రీరామచంద్రమూర్తిలాగే కనబడతాడు పైకి. ఏకపత్నీవ్రతుడే అయ్యుంటాడనిపిస్తాడు. శూర్పణఖ చాకలో దొరికితే, అధికారం వేరొకరికి అప్పగించకుండా, తనే ముక్కు చెవులు కోసేటట్టు కనిపిస్తాడు. [illegible] ఏళ్లాలుగుకి తక్కువ కాకుండా సంవత్సరాలు ఏ దండకారణ్య అథారిటీతోనో మకాం పెట్టేటట్టు కనిపిస్తాడు. తన పెళ్లాన్ని ముందే విడిచిపెట్టేశాడు — ఎవరూ ఏనేరం మోపకుండానే. క్లుప్తంగా చెప్పాలంటే — గెడ్డం గీసుకుంటూండగా బ్లేడు తెగితే, బుగ్గలు పాలుకారేటట్టు కనిపిస్తాడు.

రఘుకి నాకూ మొదటిసారిగా లా కాలేజిలో పరిచయం అయింది. ఎవరో రాసిన నాటకంలో సంభాషణలు కంఠతః పట్టి, నాకు తప్ప మరెవరికీ అర్థంకాని పద్ధతిలో చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాను ఒకరోజు. 'కేంటీన్‌లో టీ తాగుదాం రండి' అన్నాడు రఘువచ్చి. అప్పట్లో 'రండి' అనేవాడు గౌరవంగా. తర్వాత 'రా' అనేవాడు మర్యాదగా. 'రారా!' అని ముద్దుగా అనడం ప్రారంభించింది చాలా తర్వాత. ఇప్పుడు 'రారోయ్' అంటాడు, 'రాబుగాయ్' వంటి పదాలు తర్వాత చేర్చి.

'ఇప్పుడే తాగాను టీ. రాను' అన్నాను. 'యూనియన్ ఖర్చుమీదేలెండి. రండి' అన్నాడు— యూనియన్ ఖర్చుమీద కొన్న జేబురుమాలుతో, యూనియన్ ఖర్చుమీద కుట్టించుకున్న ఫ్లానెల్ పేంటు మీద పడిన యూనియన్ ఖర్చు త్రీకేసిల్సు సిగరెట్టు బూడిద దులుపుకుంటూ. అప్పట్లో రఘురావ్‌రెడ్డి స్టూడెంట్సు యూనియన్ కార్యదర్శి. కేంటీన్‌లో కూచొని టీ తాగుతూండగా తన జీవితంయొక్క మేనిఫెస్టో వివరాలు తెలిపాడు అతను. కలియుగంలో సత్యహరిశ్చంద్రుడికు స్థానం లేదన్నాడు. మోసం చేసినవాడికి, మోసం చేసి బ్రతుకుతున్నాడని తెలిసినవాడికి, లోకం నీరాజనం ఎత్తుతుందన్నాడు. 'కన్యాశుల్కం'లో గిరీశాన్ని జ్ఞాపకం ఉంచుకున్నంతమంది సౌజన్యారావును గుర్తుంచుకుంటారా చెప్పమన్నాడు. మోసం చేస్తూ పట్టుబడ్డంతో సొగసు లేదన్నాడు. అసలు పట్టుబడక పోడంతో కూడా సొగసు లేదన్నాడు. మోసంచేసి, చేయడం పూర్తయిన కొంతకాలానికి పట్టుబడితే మహామజాగా ఉంటుంది అన్నాడు.

నాకు పట్టరానంత కోపం వచ్చింది. కప్పులో టీ గుటుక్కున మింగేసి, అతన్ని మింగేసేటట్టు చూస్తూనే అతనిచేతిలో ఉన్న అణాకిళ్లీ లాక్కొని, నమిలేసి, మింగేసి —'ఇప్పుడు నువ్వు చేస్తున్న మోసం ఏమిటో చెప్పు!' అన్నాను, వెటకారంగా నవ్వుతూ. అతనుకూడా వేళాకోళంగా నవ్వి, 'చేస్తున్న మోసం బయటపెట్టడంతో సొగసు లేదు' అన్నాడు. 'నన్ను నువ్వు మోసం చెయ్యటల్లేదుగదా? మిగిలినవాళ్లని ఏం మోసగిస్తున్నావో చెప్పు!' అన్నాను. 'నిన్ను మోసగిస్తున్నానో లేదో నీకేం తెలుసు?' అన్నాడు. నా గుండెల్లో రాయి పడింది. రాయి పడనట్టుగానే మొహం పెట్టాను. 'సర్లే. చెబుతాను విను' అన్నాడు.

'నేను ఇప్పుడు ఏం చదువుతున్నాను చెప్పు?' అన్నాడు. 'లా' అన్నాను. 'లా కొక్కటే కాదు చదువుతోను. ఎమ్మే పరీక్షకి కూడా కడుతున్నాను. ఎమ్మే పరీక్షకి ఇదివరకు కట్టాను ఫెయిలయ్యాను. అప్పట్లో పరీక్ష పేసయే కిటుకు నాకు తెలియదు. ఇప్పుడు లా కాలేజీలో చేరాను. ఎమ్మే పరీక్షకి కట్టాను. పేసౌతాను. ఎమ్మే రెండో సంవత్సరం చదువుతూ, లా పరీక్షకు కట్టి పేసౌతాను. లా రెండో సంవత్సరం చదువుతూ, ఎమ్మేకి కట్టి పేసౌతాను. అది పేసై, దీనికి కట్టి ఈ పరీక్ష పేసౌతాను. పరీక్షలు సరిగా పేసైనా మూడు నాలుగు సంవత్సరాలే కదా తీసుకునేది? నేనూ అంతే' అన్నాడు.

'నువ్వు పేసౌతావని ధైర్యం ఏమిటోయ్?' అన్నాను ఈసడింపుగానే అతని దగ్గరున్న సిగరెట్టు డబ్బాలోని త్రీకేసిల్సు సిగరెట్టు తీసుకుంటూ. యూనియన్ ఖర్చుమీద కొన్న సిగరెట్టు డబ్బాలోది.

'ఇదివరకు ఆ ధైర్యం లేదు. ఫెయిలయ్యాను కూడా. కాని, పేసౌడం ఎలాగో కిటుకులు చాలా తెలుసు నాకు ఇప్పుడు. అవి ఎలాగూ చెప్పను. అనవసరంగా ఆశపెట్టుకోకు ... పోన్లే. ఒకటి చెబుతా. ఒకడి నెత్తిన చెయ్యిపెట్టి, వంద రూపాయలు తెచ్చా ఒకసారి. అది ఒక వర్ధమాన రచయిత పుస్తకం అచ్చొత్తించుకోడం కోసం ఇచ్చా. "కృతికర్త"గా నా ఫోటో వేయించుకున్నా. నన్ను, నా వంశాన్ని తెగపొగుడుతూ ఆ

(మిగతా 49 వ పేజీలో)

(౮ వ పేజీ తరువాయి)

వర్ధమాన రచయిత పద్యాలు రాశాడు అవి ఉల్లి పీరి కాగితంమీద అచ్చువేసి, వా ఫోటోకి ఎదురుగా చేర్చాడు పుస్తకంలో. ఆ వర్ధమాన రచయిత వేలు విడిచిన మేనమామ కొడుకు చేతుల్లో ఉన్నాయ్ పేపర్లు. అతనిపెట్లో రాసి అచ్చొత్తిం చకుండా పడేసిన పుస్తకాలున్నాయ్. నన్ను కృతి కర్త చేసుకుంటే బాగుంటుందనే ఐడియా మెదుల్తుంది ఆయన మనస్సులో. అన్నాడు రఘు రామన్. 'వర్ధమాన రచయితకి ఫస్టుక్లాసు వచ్చింది, నాకు సెకండుక్లాసైనా రాకపోతే, పేపర్లుదిద్దే ఆయన పుస్తకాలు ఆయనపెట్లోనే ఉండి పోతాయ్' అన్నాడు.

రఘురామయ్య ఎమ్మేలో సెకండు క్లాసు వస్తుందనుకున్నాడు కాని రాలేదు. థర్డుక్లాసే వచ్చింది. 'ఏం ?' అని అనడిగాను రెండేళ్ళతర్వాత కనబడినప్పుడు. 'ఏం ఏమిటి ?' అన్నాడు. 'సెకండు క్లాసు వస్తుందన్నావుగా ?' అన్నాను. 'అసలు నేను పరీక్ష ఫెయిలౌతానన్నావుగా ?' అన్నాడు. అని, 'అర్జెంటు పనుంది. గవర్నరు గారు రమ్మని కబురుంపారు' అంటూ వెళ్ళిపో యాడు.

తర్వాత తెలిసింది. పరీక్షలో సెకండు క్లాసు తెచ్చుకుందామని చివరివరకు శతవిధాల ప్రయత్నం చేశాట్ట రఘు. సెకండు క్లాసు రాలేదు. ఎందుకు రాలేదో చూద్దామని మార్కుల మెమోరాండమ్ తెప్పించుకున్నాట్ట. తెప్పించుకొని చూడగా, అందులో ఒక మూడును ఎనిమిదిచేస్తే ఇంత కంటె అందంగా కనిపిస్తుందేమోనని బుద్ధి పుట్టింది. సాధారణంగా ప్రూఫ్‌రీడర్లకి పుట్టే బుద్ధి! కీర్తిశేషురాలైన ఆ మూడు ఒకట్ల స్థానంలో ఉందో, పదులస్థానంలో ఉందో నేను చెప్పలేనుగాని, రఘువీరుడు తేరుకుని చూసే సరికి, మొత్తం మార్కులు సెకండు క్లాసు మార్కులు ఉన్నాయిట కాగితం మీద.

అతని మనస్సును వెంటనే ఆనందాశ్చర్య ఎట సెటరాలు పెనవేసుకుపోయాయి. సీలింగు ఫేన్ ఆన్‌చేసి, 'అహో! మాధవీలతా!. . . మంద పవనమా!!. . . సెకండుక్లాసుకీ థర్డుక్లాసుకీ ఎంతోయ్ తేడా ?' అని ప్రశ్నిస్తూ, ఒక చిన్న డేన్సు చేశాట్ట. 'ఇంతే తేడా!' అని, డ్యూయట్ కలిపిందిట అతని జీవాత్మ, మార్కుల మెమో రాండమ్ ఝుళిపిస్తూ, కూనిరాగంలా ప్రారంభించి ఉపద్రవంలా అంతం చేస్తూ లతా మంగేష్కర్ లాగ.

రాఘవరామన్ వెంటనే ఒక బస్సెసుకుని వైస్ ఛాన్సెలర్‌గారి ఇంటికి వెళ్ళాట్ట. 'అయ్యా, చూడండి, అన్యాయం జరిగింది. ఇదెక్కడి ఘోరకలి ? ఇలా చేస్తే — పరీక్షావిధానంలో ప్రజలకెల్లా విశ్వాస ముంటుంది ? మార్కులు తప్పు కూడారు. తప్పుకూడి, కష్టపడి సెకండు క్లాసు సంపాదించుకున్న నన్ను థర్డుక్లాసులో పడేశారు. ఏమిటీ అన్యాయం ?' అని గోల పెట్టేట్ట. వైస్ ఛాన్సలరుగారు ధర్మకాలం మనిషి. ఆయనకేం చేయాలో పాలుపోలేదు. 'చూడు, నాయనా, పొరపాటు మానవ సహజం. ఈ సంగతి పేపర్లో ఎక్కించకు: మమ్మల్ని ఏకించకు. యూనివర్శిటీపక్షాన నీకు క్షమాపణ పత్రం రాసిస్తాను. నిన్ను సెకండుక్లాసులో పేస్ చేయిస్తాను. ఆకాగితం ఇక్కడ విడిచివెళ్ళి, మధ్యాహ్నం ఆఫీసుకి రా!. .. నువ్వు కాఫీలో పంచ దార ఎక్కువేసుకుంటావా, తక్కువా ?' అన్నాట్ట ప్రాధేయపడుతూ.

ఆ మధ్యాహ్నం రఘు యూనివర్శిటీకి హుషా రుగానే వెళ్ళాట్ట. వైస్‌ఛాన్సెలరుగారు పది గంటలకి ధూమ్‌ధామ్ లాడుతూ వెళ్ళారు. ఎదు రొచ్చిన చప్రాసీని, డిస్మిస్ చేసినంత పని చేసి, మార్కుల రిజిష్టరు తెప్పించారు. పరిశీలించి చూశారు. అందులో మూడు ఇంటులో ఎనిమిదై ఎదురైందిట. ఎనిమిది తీవ్రంగా పరికిస్తే, కుడి పక్క బ్లూబ్లాక్ ఇంకుకి, ఎడంపక్క రాయల్ బ్లూ ఇంక్‌కి తేడా కనిపించింది. రఘు వచ్చాడని తెలియగానే, లోపలికి రమ్మన్నారుట. క్లుప్తంగా, 'పోలీసులకి కబురంపనా ?' అన్నారుట. వైస్ ఛాన్సెలరుగారు జుట్టు అందదని రూఢి ఐంది రఘుకి. ఆయన కాళ్ళు రెండూ పట్టుకున్నాడు. ఇదంతా రఘే చెప్పాడు తర్వాత నాతో. మోసం అసలు పట్టుబడక పోవడంలో సొగసులేదురా అన్నాడు.

తర్వాత రఘు జీవితం పంచరంగుల చిత్రంలా నడిచింది. తనకు ఒక వేలు విడిచిన మేనమామ గుత్తదారుగా కట్టించిన ఒక భవనం కామందు మంచితనం సంపాదించుకొని, ఆ భవనంలో కాపరం ఉంటూన్న ఒక కేంద్ర ప్రభుత్వ కార్యా లయంలో ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ప్రయత్నించడం ఏమిటి ? విజయం సాధించాడు. ఉద్యోగంలో చేరుతూండగానే, 'సర్టిఫికెట్లు' అన్నాడు అక్కడ కూచునే గుమాస్తా.

'సర్టిఫికెట్లా, సార్ ? అలాగే, సార్!. . . . టీ లో మీరు పంచదార ఎక్కువేసుకుంటారా మీరు తక్కువా ?' అన్నాడు రఘువీరరావు.

సర్టిఫికెట్టు ఇవ్వడం విషయంలో ఒక తంటా వచ్చి పడింది. ఇంత వయస్సు దాటితే గవర్న మెంటు ఉద్యోగంలో చేరడానికి వీల్లేదని ఒక రూలుంది. ఆ వయస్సు అనుకోకుండానే దాటి పోయింది. టీ తాగుతూన్నంతసేపూ గోళ్ళు గిల్లుకుంటూ కూచున్నాడు రఘు. అప్పుడు హఠాత్తుగా గుర్తుకొచ్చింది అతనికి భగవంతుడు మనకి గోళ్ళు అనవసరంగా ఇవ్వలేదని. గుమాస్తాని అలా బయటికి పంపించి, గోళ్ళతో గీకేశాడు సర్టిఫికెటుమీద రాసున్న అంకెల్ని. చూడ ముచ్చ టైన అంకెలతో, ఎవరూ అభ్యంతరం చెప్ప డానికి వీలులేని పుట్టినతేదీ వేశాడు సర్టిఫికెటు మీద.

ఈ కాలంలో ఎవర్నీ నమ్మడానికి వీల్లేదన్నాడు రఘు. తన ఖర్చుమీద టీ తాగిన గుమాస్తాయే రిపోర్టు పెట్టాట్ట. అక్షరాలకు అంకెలకూ తేడా ఉంది సర్టిఫికెట్టుమీద. వారం తిరక్కుండా, ఆఫీసరు రఘుని తన గదిలోకి పిలిపించాడు. 'పోలీ సులకి కబురంపిస్తున్నా' అన్నాట్ట ఆఫీసరు. రఘు ఆలస్యం చెయ్యకుండా, ఆఫీసరు కాళ్ళెక్క డున్నాయో వెదకి, రెండు చేతుల్తో పట్టు కున్నాట్ట. 'ఇంకెప్పుడు చెయ్యవుగదా ?' అన్నాట్ట ఆఫీసరు. 'ఇదివరకెప్పుడూ చెయ్యలేదు, ఇంకె ప్పుడూ చెయ్యను' అన్నాట్ట రఘు. 'సరే! క్షమిం చాను. వెంటనే రాజీనామా పెట్టు ఉద్యోగానికి' అన్నాడు అధికారి. రఘు రాజీనామాపై దస్కతు పెట్టాడు. అధికారి అంగీకరించినట్టు ఉత్తరం రాసి ఇచ్చాడు. ఉత్తరం చేత్తో పట్టుకొని, అధి కారి జుట్టుకోసం వెదికాట్ట రఘు. 'పని చేసిన వారానికి జీతం ఇస్తావా ?' అని, '—లేక చస్తావా? అన్నట్టు చూశాట్ట.

ఈ విషయం తర్వాత నాతోచెప్పి 'అహ్హా హ్హా' అన్నాడు రఘు.

తర్వాత తర్వాత రఘు ప్రైవేటు ఉద్యో గాల్లో చేరాడు. అతడు తలచుకుంటే దొరకని ఉద్యోగం లేదు. పత్రికల్లో చేరి, తనవి కాని కథలు ప్రచురించుకున్నాడు. సంఘాల్లో చేరి, తనవి కాని పదవులు తనవి చేసుకున్నాడు. తనవి కాని సొమ్ములు తనవి చేసుకున్నాడు

ఇప్పుడు రఘు ఎక్కడున్నాడో తెలియదు. ఏ పేరుతో చెలామణీ ఔతున్నాడో తెలియదు, మీపేరు పాతకేశ్వరరావో, పాతకేశ్వరమూర్తో —రవో, — రరెడ్డో, — రయ్యో, అన్నదాని మీద అతనిపేరు రఘురామారావో, రాఘవరామ మూర్తో, రఘురామనో, రఘురామరెడ్డో, రఘువీరయ్యో అన్నది ఆధారపడి ఉంటుంది.

కొన్ని సంవత్సరాల క్రితం, రఘు అదృశ్యం కాబోయే ముందు, నాతో అన్నాడు : 'నేను ప్రణాళికారణ్యంలోకి చొచ్చుకుపోతున్నాను. మళ్ళీ ఎప్పుడో కనబడతాను. ఈలోగా నీకో సలహా ఇస్తున్నాను. ఉచితంగానే అనుకో. నాటకాల్లో చేరి, చేతకాని రంగు వేసుకుని, ఎవరివో సంభా షణలు ఎవరికీ అర్థం కాకుండా చెప్పి, ఏం భ్రాంతి కల్పించగలవు ?. . . . . నా మాట విను :టికెట్టు తీసుకుంటూన్నట్టు తెలియకుండా మోసం చెయ్యడంలో ఉంది మజా!

కాని, కాని — ఈ మాటలు చెప్పేటప్పుడు మాత్రం అతను మోసం చెయ్యడం లేదని గేరంటీ ఏమిటి ?

★

